# డాడీ కాదు నాన్న!

బాసుమతి బియ్యానికి భారత్ పెట్టింది పేరైతే వాటి మీద అమెరికన్ సంస్థ రైస్‌టెక్‌కు పేటెంట్ హక్కులెట్లా లభించాయో !.... ఎందుకు లభించవూ, పేటెంట్ హక్కుల సంస్థ అమెరికా పిడ్రుకిట్లోనే ఉంది గదా ! అయినా పిల్లి గుడ్డిదైతే ఎలుకపిల్ల గూడా గిల్లికజ్జాలకు దిగుతుందట. పేటెంట్ హక్కుల పెంటలో మేము భాగస్వాములం కాబోమని భారత్ ఆనాడు గట్టిగా వాదిస్తే పీడావదిలిపోయేది. ఈ విచిత్ర పరిస్థితిక్కారణం ఆనాటి మన పాలకుల మెతక వైఖరే గదా.

కాని... అలా వాదిస్తే ప్రపంచ బ్యాంకు అప్పులకొప్పులకాస్కారమివ్వదు గదా ! ఆ బ్యాంకు జుట్టు గూడా అమెరికా పట్టులోనే ఉంది గదా !

పేపర్ మడిచి పక్కన పడేసి తనలో తానే నవ్వుకున్నాడు వీరేశం.

మరీ... ఈ విచిత్ర పరిస్థితికి కారణమెవరూ ?

అంతరంగ తరంగమొకటి ఎదురు తిరిగింది. అది కాస్సేపలాగే నిలబడి ఉక్కిరిబిక్కిరి చేసింది.

ఇలా ప్రకృతి ఒడిలో, తాత ముత్తాల నుండి సంక్రమించిన మామిడి తోటలో ఒంటరిగా కూచున్నప్పుడే అతనికలాంటి ఆలోచన లొస్తాయి. సమాధానాలు గూడా అక్కడే లభిస్తాయని అరవయ్యేళ్ళ అనుభవం చెబుతోంది.

ఈ మట్టికీ తనకూ గట్టి అనుబంధముంది. అది మానస వీణను మీటుతుందే తప్ప మాటలకందదు.

మెల్లిగా నేలకొరిగి వెల్లకిలా పడుకున్నాడు.

మట్టి వాసన పసందుగా ఉంది. తల్లి ఒడిలో సేద దీర్చుకుంటున్నట్లు హాయిగా ఉంది.

ఆకుపచ్చ పీతాంబరం ధరించింది వనదేవత. నిండా పిందెలతో - తొలి గర్భిణిలా మురిసిపోతూంది మామిడిగున్న. తుమ్మెదల సన్నాయి రాగాలు. వాటికి తోడు పక్షుల కిలకిలా రావాలు. సూర్యుడు మబ్బుల దుప్పటి కప్పుకున్నాడు. వసంత లక్ష్మికి సీమంతోత్సవం కాబోలు !

కాని... ఏది మరచి పోవాలని మామిడితోటలో కొచ్చాడే అదే మెదడు పొరల్లో తిరుగుతూంది.

ప్చ్... ! కొడుకులిలాగైపోయారేమిటీ ? వాళ్ళకు నేనేం తక్కువ చేశాననీ ! ఆనాడు -

"ఆడపిల్ల లేదనే ఆరాటమెంకండీ ? పున్నామనరకం నుండి తప్పించేందుకు ముత్యాల్లాంటి ముగ్గురు మగపిల్లలున్నారు. బ్రహ్మానందం, విష్ణుమూర్తి, శివానందమని త్రిమూర్తుల పేర్లు పెట్టుకున్నాం గదా ! రేపు వాళ్ళకు పెళ్ళిళ్ళైతే త్రిమాతల్లాంటి కోడళ్ళొస్తారు. వాళ్ళే మన కూతుళ్ళనుకొందాం.

సులోచన తియ్యని మాటలు వెన్నుపూసకు వెన్నపూస రాశాయి.

ముగ్గుర్నీ విదేశీ విద్యా సంస్థలు నడిపిస్తూన్న రెసిడెన్షియల్ స్కూళ్ళలో చదివించానే !

ఏడెకరాల మాగాణిలో బాసుమతి వరిపంట, మూడెకరాల మామిడితోట, చిన్న బంగాళాను కనిపెట్టుకుంటూ ఫీజులకూ, ఖర్చులకూ ఎన్నడూ వెనకాడలేదు. కష్టమనిపించినా వాళ్ళిష్టపడిన డ్రెస్సులే కుట్టించాను. ఎండాకాలం సెలవుల్లో ఏవేవో కోచింగులు సరేసరి.

లక్ష్యం ఒక్కటే - లక్షలు ఖర్చైనా లక్ష్యపెట్టగూడదు. కొడుకులు బాగా చదవాలి. విదేశాల కెళ్ళాలి. ఇబ్బడి ముబ్బడిగా డబ్బు సంపాదించాలి.

డబ్బుల లోకమె నాకము
డబ్బుకు సరిసాటి లేదు. డాక్టరుగూడా
డబ్బుకు తలవంచును పో,
డబ్బులతో సుఖాలన్నీ డాబుగ దొరుకున్
వాళ్లు సుఖపడాలి, మమ్మల్ని సుఖపెట్టాలి.

ఆశలకనుగుణంగానే బ్రహ్మానందం ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ ఫస్ట్‌క్లాసులో పాసయ్యాడు. అమెరికాలో ఉద్యోగం అలవోకగా దొరికింది. భౌతిక సుఖాలకు స్వర్గధామమైన అమెరికాకు బ్రహ్మానందాన్ని సాగనంపుతూంటే - బ్రహ్మానందమనిపించింది. ప్రపంచమో నందనవనములా కన్పించింది.

"చూశారా, మన పెద్దకొడుకు ఎవరెస్ట్ శిఖరమంత ఎదిగిపోయాడు". మంచుపూలైన సులోచన కళ్ళల్లోని ఆనంద బాష్పాలు తన ఎదపొదలో అమృతబిందువులై రాలాయి.

కొడుకు ఎడబాటు కొద్దిపాటి బాధ కలిగించినా దిగమింగక తప్పలేదు.

రెండోవాడు విష్ణుమూర్తిది ఆదివిష్ణులా - నిండైన విగ్రహం. గుండెజబ్బుల్ని శస్త్రచికిత్సతో నయం చెయ్యగల నిష్ణాతుడయ్యాడు. కార్డియాలోజిస్ట్‌గా మరింత ఎదగాలనుకున్నాడు. ఎఫ్.ఆర్.సీ.యస్‌లో జాబ్ కం స్టడీ సీటు దొరికింది. లండన్‌లో చదువుతూ రెండు చేతులా సంపాదించవచ్చు. చదువయ్యాక నాల్గు చేతుల సంపాదన....

ఖర్చుల కోసం రెండెకరాల పొలం అమ్మినా ఆయాసమన్పించలేదు. పొలం పోతే పోయింది గాని రెండో కొడుకు కొండంత ఎదిగిపోతున్నాడు. సులోచనా, తాను ఆనంద సంద్రములో మునకలు వేశారు.

ఆ తర్వాత తెలిసింది - సంవత్సరాల పాటు కొడుకుల ఎడబాటు ఎంత బాధాకరమో ! మన దేశంలో ఏ మూలనున్నా సంక్రాంతి పండక్కో, సమ్మర్లోనో మమ్మీ, డాడీ అంటూ దిగిపోయేవారు. వాళ్ళకా దేశాల్లో సుఖాలన్నీ అందుబాటులో ఉన్నాయి. ఇహ ఎవరెందుకు గుర్తుకొస్తారు ? దేశం ఎల్లలు దాటి సంవత్సరాలు గడిచినా కళ్ళల్లో మెదుల్తున్నారే తప్ప కళ్ళముందుకు రావడం లేదు.

తండ్రిగా తాను ఆరాటాన్ని అదిమిపెట్టుకున్నా కన్న తల్లి కంటతడి మనసు మైదానములో సుడిగాలి రేపింది.

"వీళ్లి మాత్రం ఏ వ్యాపారంలోకన్నా దింపి ఇంటి పట్టునే ఉంచేద్దామండీ" అంది శివానంద తలను ఆప్యాయంగా నిమురుతూ.

"ఔను మమ్మీ !" శివానందం బుల్లిపాపలా తల్లి ఒడిలో తలదూర్చాడు. "ఆ ఎం.బి.ఏ. కాస్తా అమెరికాలో చదివొచ్చి ఆంధ్రలోనే సెటిలైపోతా"

"అం...టే !" సులోచన కనుగుడ్లు కాస్సేపలాగే నిలబడిపోయినై. "నువ్వు గూడా విదేశాలకెల్తావురా కన్నయ్యా ?"

"వెళ్లి మళ్ళీ రావాలనే ప్రయత్నిస్తా మమ్మీ. ఏ వ్యాపారం చెయ్యాలన్నా మోడరన్ బిజినెస్ టెక్నిక్స్ అన్నీ పూర్తిగా తెలుసుకోవాలి. స్టేట్స్‌లో ఎం.బి.ఏ చదివితే స్టేటస్ చాలా పెరిగిపోతుంది మమ్మీ !"

"అదేదో మన దేశంలోనే చదవొచ్చుగదరా !" తనూరుకోలేదు.

"చదవొచ్చు కానీ... ఆఫ్టరాల్ మనదేశం డిగ్రీలనెవడు కేర్ చేస్తాడు డాడీ ?"

"ఎందుకు చెయ్యరూ ?..." సముదాయించబోయాడు. క్షణంలో శివానందం మొహం శివరాత్రి నాటి గోగుపూవులాగైంది.

"అదేంటి డాడీ, అన్నయ్యలను హాయిగా ఫారిన్ కంట్రీస్‌కు పంపి నన్నో కంట్రీబ్రూట్‌గా తయారు చేస్తారా ?"

హమ్మనా కొడకా... ఎంత మాటన్నావురా ?

"అది కాదురా ! నిన్ను విడిచి నేనుండలేనురా" సులోచన లోచనాలు జలపాతాలైపోయినై.

"నో మమ్మీ ! నన్ను అమెరికా పంపాలంటే ఖర్చని బాధగదూ ! తనయుల పట్ల తల్లిదండ్రుల అసమదృష్టి అన్యాయం కాదా !"

మాటల బాంబులు సూటిగా గుండెలకు గురిపెట్టాడు.

"ఒరేయ్ ! మమ్మల్ని కాస్త అర్థం చేసుకోరా !" పొత్తి కడుపులోంచి పొంగుకొస్తున్న లావాను కుత్తుకలో బంధించాల్సి వచ్చింది.

"అర్థం చేసుకుంటున్నా డాడీ ! చేతిలో డబ్బు లేకపోతే మరో రెండెకరాల పొలం అమ్మితే పోలా !"

రెండు గొంతులు మూగబోయినై.

"మీకు అన్నయ్యలు చేసిన మేలేమిటి, నేను చేసిన కీడేమిటి ? మీరు మొండికేస్తే నేను ఏ పురుగుల మందో తాగి సూసైడ్ చేస్కుంటా. అంతేగాని నా భవిష్యత్తును బండలపాలు కానివ్వను'

"వద్దు బాబూ, వద్దు" హడలిపోయింది తల్లి. "నీ ఇష్టమొచ్చినట్టే వెళ్ళిపో" కొడుకు నోరు మూసింది.

ఇంకో రెండెకరాల పొలం ఇతరుల చేతిలోకెళ్ళింది. శివానందం విమానమెక్కి ఆనందంగా ఎగిరిపోయాడు.

మిగిలిన మూడెకరాల పొలం, దాన్నానుకున్న ఈ మూడెకరాల మామిడితోట, ముగ్గురు కొడుకుల మీద తగ్గని ఆశ... మూడుళ్ళు గడిచినై.

శివానందం వెళ్ళగానే ఓ ఉత్తరం రాశాడంతే.

దేశం విడచి వెళ్ళాక మొదటివాడు మూడుత్తరాలు రాశాడు. రెండోవాడు రెండింటితో సరిపెట్టాడు. ఆ తర్వాత ఉత్తరాల మాట ఉత్తదైపోయింది. సులోచన మాత్రం పట్టువదలని విక్రమార్కుడిలా ఉత్తరమ్మీద ఉత్తరం రాస్తూనే ఉంది. ఉద్యోగాల కోసం పంపిన దరఖాస్తుల్లా దేనికీ జవాబు జాబు లేదు.

"నా పిల్లలకేమైపోయిందో ఏమోనండీ !" సులోచన విలవిల్లాడింది. ఆస్తిపాస్తులన్నీ ఎవరో దోచుకెళ్లినట్టు తన మనసు పరిపరివిధాల పరితపించింది.

ఉన్నట్టుండి బ్రహ్మానందం నుండో ఉత్తరం ఊడిపడింది. సులోచనే చదివి వినిపించింది.

"డాడీ ! మమ్మీ లెటర్సన్నీ అందాయి. ఈ రోజు నా మ్యారేజ్‌డే. సంవత్సరం క్రితం అమెరికాలో సెటిలైన హర్యానా అమ్మాయి చమేలీతో నా పెళ్ళైంది. ఒక్క సంవత్సరం ఒక్కరోజులా గడిచింది. నా ఇష్టాన్ని మీరెలాగూ కాదనరు గదా! నాకో ఉన్నతమైన ఉద్యోగముంది. కావల్సిందానికంటే కొన్ని రెట్లు ఎక్కువే సంపాదిస్తున్నాను. ఏ.సి. బంగళా, ఏ.సి. కారు, మోడ్రన్ టెలీఫోన్ అన్నీ ఉన్నాయి. నా గురించి వర్రీ కావద్దని మమ్మీకి చెప్పండి. బ్రదర్ శివానందం ఎం.బి.ఏ. కంప్లీటైంది. కాలిఫోర్నియా కార్ల కంపెనీలో పెద్ద జాబ్ దొరికింది. వాడు హేపీగా ఉన్నాడు. మా పెళ్ళికి వచ్చి వెళ్ళాడు. చాలా బిజీగా ఉన్నాను. ఉంటాను..."

పెళ్ళైందా ! నా బాబుకు పెళ్ళైందా ! బంధుమిత్రుల సమక్షములో, పచ్చని పందిట్లో, రంగరంగ వైభోగంగా మా చేతుల మీదుగా జరగాల్సిన పెళ్ళి... నా ఇంట్లో సన్నాయి రాగాల పలక్కుండానే, ఎక్కడో సప్తసముద్రాలవతల జరిగిపోయిందా ! కడుపులోని పేగుల్ని కరకర కోసి కారప్పొడి చల్లినట్టు... బాధ, కోపం, ఆందోళన, ఆక్రందన...

తల్లి హృదయములో ఎంత పెద్ద తుఫాను చెలరేగిందో - ఉత్తరాన్ని పదేపదే గుండెలకు హత్తుకుంటూ కన్నీటితో తడిపేసింది.

మూడ్రోజుల తర్వాత పక్కూరికెళ్ళి విష్ణుమూర్తికి ఫోన్ చేసి -

"చూశావురా నీ అన్నయ్య నిర్వాకం..." అంతా చెప్పి - సాంత్వన వచనా లాశించాడు.

"దాందేముంది డాడీ ! వానికి నచ్చిన అమ్మాయితో వాని పెళ్ళైంది. నాకు నచ్చిన గర్ల్ ఫ్రెండ్‌తో నా పెళ్ళైంది. ఇదంతా రొటీన్ గదా ! దీంట్లో బాధపడాల్సిందేముందీ ?"

"ఆఁ ! నీ పెళ్ళి గూడానా... ! మాకు తెలీకుండానే ! అంతా మీ ఇ... ష్ట... మే...!' నాలుక తడారి పోయింది. గొంతు మొరాయించింది.

"హయ్యో డాడీ ! మనం ట్వంటీ ఫస్ట్ సెంచరీలో కలుస్తున్నాం. ఇప్పుడు గూడా ఇంత

చాదస్తమా ? అన్నట్టు నా వైఫ్ గూడా డాక్టరే. బోలెడంత సంపాదిస్తున్నాం...." ఇంకేమేం చెప్పాడోగాని మెదడు పంజెయ్యలేదు.

ఇంట్లో దొంగలు పడి దోచుకు పోయారని పోలీస్ స్టేషన్లో రిపోర్టిద్దామని వెళ్ళి లాకప్‌లో లాఠీ దెబ్బలు తిని లంచమిచ్చి బయటికొచ్చినట్లైంది.

ఇరవయ్యొకటో శతాబ్దలోకెళ్ళడమంటే బాంధవ్యాలను బొందబెట్టడమా ? రక్త సంబంధాలు రిక్తమైపోవడమా ? అలాగైతే మనం వెల్తుంది మరో మొహంజదరో నాగరికతలోకి, పాతరాతి యుగంలోకి... ...

ఎక్కడో ఏదో పొరపాటు జరిగిపోయింది.

లోపలి పొంగులేవీ బయటికి పొక్కనివ్వకుండా విషయాన్నెంత సున్నితంగా చెప్పినా సులోచన మాత్రం గబాలున కుప్పకూలిపోయింది. పాపం ! ఆశల పల్లికిలో ఊరంతా ఊరేగుదామనుకుంది గదూ ! వెర్రి బాగుల్ది...

"హయ్యో! పసుపూ పారాణితో కోడళ్లు పచ్చని తోరణాల మధ్య తిరుగుతూంటే, తోటి ముత్తైదువుల్ని నవ్విస్తూ, నవ్వుతూ సరదాగా గడపాలని ముచ్చట పడ్డానే... కోడళ్ళే కూతుళ్ళై కష్టసుఖాల్లో కలిసుంటారని కలలు గన్నానే..." నెత్తీ నోరు కొట్టుకుంది. మోకాళ్ళలో మొహం దాచుకుని గోడుగోడుమంది.

మర్నాడు నొప్పి అంటూ గుండె పట్టుకుని కొట్టుకులాడింది. పట్నం డాక్టర్ పరీక్ష చేసి హార్ట్ ఎటాకని తేల్చాడు. మానసికంగా విశ్రాంతి చాలా అవసరమని మరీ మరీ చెప్పాడు.

"ఎంత ఖర్చైనా ఫరవాలేదు, చిన్నోడిని వెంటనే తిరిగి రమ్మనండి. వాడు మనకళ్లముందే ఉండాలి. మన చేతుల మీదుగా వానికి పెళ్ళి చెయ్యాలి... " చెవిలో జోరీగైంది.

శివానందం ఫోన్‌లో దొరకలేదు. ఇల్లు ఖాళీ చేశాడని తెలిసింది గాని కొత్తింటి అడ్రసు దొరకలేదు.

ఈ సంగతి సులోచనకు తెలియన్వివను. ముందావిడ ఆరోగ్యం పూర్తిగా కుదుటపడాలి.

ఆ రోజు శనివారం. వరి కోత ప్రారంభమైంది. ఉదయం నుండి పొలం దగ్గరే గడిచింది. మధ్యాహ్నం ఇంటికొచ్చాక సులోచన అలికిడి వినబడలేదు. వాడిన పూవులా నేలమీద పడుంది.

"సులోచనా... సులోచనా !" భుజాలు పట్టి కుదిపినా కదలిక లేదు. చల్లగా, ఒళ్ళంతా చల్లగా ఉంది. కాళ్ళూ చేతులు కట్టెల్లాగైపోయినై. పక్కన పెళ్ళి పిలుపు కార్డు...

శివానందం పెళ్ళి శుక్రవారం నాడు లండన్‌లో జరిగిపోయింది. కవరు మీది పోస్టుముద్రలు గుండెల్లో శతఘ్నులు పేల్చేసినై.

ముప్పయ్యైదేళ్ళ క్రితం చేతిలో చెయ్యేసి మూడుముళ్ళ బాసలు చేయించుకున్న సులోచన, జీవన బృందావనములో ఆమని సృష్టించిన హృదయరాణి, కడుపు పండాలని కనబడిన దేవుళ్ళకల్లా మొక్కిన పవిత్రమూర్తి, పొద్దటి వరకూ కలిసి తిరిగిన అర్ధాంగి... ఎవ్వరూ లేనప్పుడు... ఒంటరిగా...

గుండెకోత భరించలేక గుండె పగిలి చచ్చిందా !... లోకమంతా చీకటిగా కన్పించిందా క్షణం.

తల్లి చావు వార్త తనయులకు తక్షణమే అందించాలని పట్నం వెళ్ళి ఫోన్ చేస్తే - పెద్దవాళ్ళిద్దరూ వీకెండ్ విహార యాత్రలకెళ్ళారని తెలిసింది. మరణవార్త పనిమనుషులకే చెప్పాల్సి వచ్చింది. వెడ్డింగ్ కార్డులున్న చిన్నోడి ఫోన్ నెంబర్ కలిసింది. కాని అదృష్టమే కలిసి రాలేదు. కొత్త జంట హనీమూన్ కెళ్ళిందంట.

కనిపెంచిన తల్లి చితికి నిప్పంటిచలేని కొడుకులు ముగ్గురున్నా, మూడొందలున్నా ఏం లాభం ? అపుత్రస్య గతిర్నాస్తి అయితే త్రిపుత్రస్య సుఖం నాస్తి అనుకోవాలా ?

"కన్న కొడుకుతో తలకొరివి పెట్టించుకోలేని సంతానవతి కంటే గొడ్రాలే నయం".

"కన్నతల్లి శవాన్ని గూడా కళ్ళారా చూడని పిల్లలు అమెరికాలో ఉంటేనేం, అడవుల్లో ఉంటేనేం?"

"పిల్లలకు చిన్నప్పట్నుంచే చదువుతో పాటు సంస్కారం అలవడాలి. ఆచార వ్యవహారాలు అర్థమయ్యేలా చూడాలిగాని పెద్ద చదువులూ, విదేశాల్లో ఉద్యోగాలంటూ వెంపర్లాడితే ఇదిగో... ఇదీ ఫలితం ..... "

నలుగురూ నాలుగు రకాల వ్యాఖ్యానించారు.

ఊరి పెద్దలంతా ఏదో మాట్లాడుకున్నారు.

"ఒరేయ్ వీరేశం ! ఇప్పుడు జరగాల్సిందేదో జరిగి తీరాలి గదరా ! అప్పటికే రెండ్రోజులైంది. శవాన్ని ఇంకెంతో సేపు ఉంచలేము గదరా !" బాల్యమిత్రుడు, రిటైర్డ్ టీచర్ రంగనాథం పక్కకు లాక్కెళ్ళి చెప్పాడు. అతని గుండెల మీదవాలి

"రంగా ! నాకు బతకాలని లేదురా !" బోరుమన్నాడు.

"ఋణానుబంధ రూపేణా, పశుపత్నీ సుతాలయా అన్నారు గదా ! ఎవరికెంత ఋణపడున్నామో అంతవరకు చేయించుకుని వెళ్ళిపోతారు. మేధావుల మీద గూడా మేధోహక్కులు సంపాదించాలనుకుంటున్న అగ్రరాజ్యాల్లో ఉన్నారైరి నీ కొడుకులు. నువ్వు నీ కొడుకుల చదువు గురించే ఆరాటపడ్డావుగాని మన సంస్కృతి గురించి ఆలోచించ లేదు గదరా !"

"మరిప్పుడేం చెయ్యాల్రా ?"

"నీ భార్యకు నువ్వే అంత్యక్రియలు చెయ్యాలి."

నాకు తోడూ నీడగా నిలిచిన సులోచన శరీరానికి నిప్పు పెట్టాలా ? చల్లని మనసుతో నా మనసులోని మంటల్ని ఎప్పటికప్పుడు చల్లార్చిన నా భార్యను నా చేతుల్తో చితిమంటల కాహుతివ్వాలా? బుర్రలో భూగోళం బద్దలైంది.

"అసాధ్యం, అసంభవం, ఆ పని నేను చెయ్యలేనురా..."

"మరెలారా ?"

"అనాథ శరణాలయం నుండో అబ్బాయిని తీసుకురండి"

కారులో వెళ్ళి అనాధ శరణాలయం నుండి నటరాజును తీసుకొచ్చారు. శరణాలయం అధికారులు ఏవో కాయితాల మీద సంతకాలు తీసుకున్నారు.

పదో తరగతి పరీక్షలు రాసొచ్చిన ముక్కుపచ్చలారని నటరాజు చేతుల మీదుగా సులోచన చివరి మజిలీ చేరింది. పిడికెడు బూడిదగా మారింది...

" అలా ఆకాశం వైపు చూస్తున్నారెందుకు బాబుగారూ ? ఆకులూ అవీ మీద నిండినా దులుపుకోరా ఏమిటీ ?" అప్పుడే పరుగెత్తుకొచ్చిన నటరాజు ఒళ్ళు తడుముతూ బట్టలు దులిపాడు. అతని పలుకరింపు వీరేశాన్ని మరో ప్రపంచం లోంచి మహా ప్రపంచలోకి లాక్కొచ్చింది.

ఒంటికి హాయిగా ఉంది. పున్నమి వెన్నెలలో వెన్నముద్ద చప్పరిస్తున్నట్టు - నటరాజు స్పర్శతో మనసులోని మంటలు మాయమైపోతున్నాయే !... ఏనాడన్నా, ఏ కొడుకన్నా తననలా తాకాడా? ఆత్మీయంగా మాట్లాడాడా ?

తమకంగా లేచినుంచున్నాడు వీరేశం. గాలి-తరంగమొకటి రివ్వున మీచింది. మామిడి ఆకులు, పూలు జలజలా అభిషేకించాయి.

ఇంటికెళ్ళి కలిసి భోం చేశారు. వంటకాలు రుచిగా, చాలా రుచిగా ఉన్నాయి.

"ఈ రోజేమన్నా విశేషమా జగదాంబా ?" అడిగాడు వంట మనిషిని.

"మన నటరాజు బాబు పుట్టిన రోజటయ్యా ".

"అంతే కాదండి. నేనిక్కడుండడం ఇదే చివరి రోజు..." నటరాజు కళ్ళు మసకబారాయి.

"అరెరే ! పుట్టిన రోజా ! ఆ మాట ముందు చెప్పాల్సిందే !"

"చెబితే మీరేం చేసేవారోగాని రేపట్నుంచి మళ్ళీ నేను అనాధ శరణాలయంలో ఉండాలన్న సంగతి మరిచపోలేను గద బాబుగారూ !..." నటరాజు గొంతులో పొంగులేవో నాట్యం చేస్తున్నట్టుంది. "నా తల్లిదండ్రులెవరో నాకు తెలీదండీ. మీ దయవల్ల మూడునెలలు హాయిగా గడిపాను. రోజా సులోచనమ్మ ఫోటోకు మొక్కుకుంటూ ఇంట్లో ఉంటుంటే దేవుని గుడిలో పూలచెట్ల క్రింద ఆడుకుంటున్నటనిపించిందండి. మీకు నా దండాలండీ..." అమాంతం కాళ్ళను చుట్టేశాడు. పనివాని కన్నీరు పాదాలను కడిగేస్తుంది.

నటరాజును మళ్ళీ వాళ్ళకప్పగించాలి గదూ ! కన్నతల్లిలా, కట్టుకున్న ఇల్లాలిలా వాడు రోజూ నా అవసరాలు చూస్తున్నాడు. సులోచన ఫోటో ముందు తలవంచి పరవశించి పోతున్నాడు. అసలు సిసలైన పుత్రుడిలా దశదిన కర్మ నియమనిష్ఠలతో చేశాడు. వాణ్ణొదిలి నేనుండగలనా ? గుండె గూటిలోంచి జాలువారిన వాత్సల్యం కళ్ళ ద్వారా కాలువై నటరాజు వీపు మీద కురుస్తోంది... వీల్లేదు. వీణ్ణొదులుకోలేను. వీడెప్పుడూ నా దగ్గరే ఉండాలి. నా వంశాన్నుద్ధరించాలి. ముగ్గురు కొడుకుల ద్వారా పొందలేని పుత్రోత్సాహం వీని ద్వారా పొందాలి. అంతే ! మళ్ళీ పొరపాటు చెయ్యగూడదు.

నటరాజును లేవనెత్తి కపోలాలలను కండువాతో అద్దాడు. గుండెలకు గట్టిగా హత్తుకున్నాడు.

వారం క్రితమే ఆ ఊరికి టెలీఫోన్ సౌకర్యమేర్పడింది. సొంత ఫోన్ ఎత్తి చకచకా నెంబర్లు తిప్పాడు. అనాధ శరణాలయం మానేజర్ గొంతు వినబడింది.

"హలో ... నేనే... వీరేశంను...."

" .... ..... "

"ఓఫ్ ! చాలా సంతోషం. ధన్యవాదాలండీ"

వీరేశం నరనరాన నూతనోత్సాహం సరసర గంతులేసింది. కొత్త ఆశ చిగురులు తొడిగి చిత్తాన్నలరించింది.

అంతా విన్న నటరాజు అమాంతం ఒళ్ళో వాలాడు.

"నిజానికి నేనీ రోజు మళ్ళీ పుట్టానండీ. ఇహ నేను మిమ్మల్ని డాడీ అని పిలవొచ్చా బాబుగారూ !"

"డాడీ కాదు, నాన్నా అని పిలవాలి బాబూ ! ఈ ఊళ్ళోనే ఉండాలి. నేను చచ్చాక నా తలకొరివి నువ్వే పెట్టాలి. మీ అమ్మ సులోచనకూ, నాకూ ఏటేటా పిండ ప్రదానం చెయ్యాలి నటరాజా !..."

గంగా యమునల సంగమమైన రెండు నిండుగుండెల చప్పుళ్లు వింటూ జగదాంబ గుండెల నిండా ఊపిరి పీల్చుకుంది.

**జాగృతి - 22-28 ఫిబ్రవరి 1999**